క్లుప్తంగా

మూత'బడి'ని తెరిపించండి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

దండేపల్లి: మండలంలోని కొత్తమామిడిపల్లిలో గత పదిహేనేళ్ల క్రితం మూతబడిన ప్రాథమిక పాఠశాలను తెరిపించాలని గ్రామస్తులు ఎంఈవో దుర్గం చిన్నయ్యకు శనివారం దండేపల్లిలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలో విద్యార్థులు లేని కారణంతో పాఠశాలను మూసి వేశారు. ప్రస్తుతం గ్రామంలో అనేక మంది బడీడు పిల్లలు ఉన్నారని, వారి కోసం మూతబడిని తెరిపించి, పాఠశాలను పునః ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో గడ్డం రాంచందర్, సత్తయ్య, పనాస సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్: ఆర్థిక దోపిడీకీ పాల్పడుతున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, యూఎస్ ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా కృష్ణాకాలనీలోని ప్రైవేటు స్కూల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా రేకుల షెడ్డులో పుస్తకాలు ఏర్పాటు చేసి అక్రమంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. పాఠశాల వద్ద శనివారం ఆందోళన చేశారు. పాఠశాల గుర్తింపును రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమ ఫిర్యాదుతో ఎంఆర్‌సీ సిబ్బంది వచ్చి పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెన్నెల: మండలంలో అర్హత కలిగిన కుటుంబాలు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) కింద మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని శనివారం తహసీల్దార్ మహేంద్రనాథ్ తెలిపారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులకు ఈ పథకం కింద రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. 18సంవత్సరాల నుంచి 60సంవత్సరాల లోపు వయస్సు ఉన్న కుటుంబ పోషకుడు చనిపోతే ఆ కుటుంబాలకు ఆర్థిక సాయం లభిస్తుందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న పింఛన్ పొందని వితంతువులు దరఖాస్తుకు అర్హులన్నారు. కుటుంబ యాజమాని మరణించిన రెండేళ్లలోపు మరణ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకాల జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనుమతులతోనే భగీరథ నీటి సరఫరా

భీమారం: 'భీమారం అడవుల్లో భగీరథ నీళ్లు'అనే శీర్షికతో 'సాక్షి'లో శనివారం ప్రచురితం అయిన కథనానికి మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ మధుసూధన్ వివరణ ఇచ్చారు. అడవుల గుండా మిషన్ భగీరథ నీటి పైపుల నుంచి నిబంధనల మేరకే నీటిని అందిస్తున్నామని తెలిపారు. అటవీ స్టేజ్ 1 అనుమతుల సమయంలో జరిగిన ఒప్పందంలో భాగంగా ఈ నీటిని అందిస్తున్నామని తెలిపారు. దీనివల్ల ఇతర మండలాలకు ఎలాంటి నీటికొరత లేదని ఆయన తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: ఆపరేషన్ కగర్ పేరిట కొనసాగుతున్న హత్యాకాండను ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ. శ్రీనివాస్ అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జరిగే రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లాల్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, అరుణోదయ రాష్ట్ర కోశాధికారి మల్లన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు సురేందర్, చిన్నయ్య, రాజేశం, మల్లేష్, సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆయిల్ ఫాంలో అంతర్‌పంటలతో లబ్ధి



అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ అధికారి

జన్నారం: ఆయిల్ ఫాం పంటసాగుపై ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, ఆయిల్ పాం తోటలో అంతర్‌పంటలు వేసుకొని రైతులు లబ్ధి పొందాలని హార్టికల్చర్ అధికారి సహజ, మ్యాట్రిక్స్ సీఈవో ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. జన్నారం మండలం దేవునిగూడలో శనివారం ఆయిల్ పాం పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పాం తోటల్లో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మిరప, పసుపు, పూలు, కూరగాయలు అంతర్‌పంటలుగా వేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మ్యాట్రిక్స్ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మల్లేశ్, రైతులు బాపురెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటి, బుచ్చన్న తదితరులు ఉన్నారు.



జన్నారం: యోగా చేస్తున్న అటవీ అధికారులు



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



యోగా గురువులను సన్మానిస్తున్న దివాకర్‌రావు



వెల్లనూర్‌లో యోగా అక్షర క్రమంలో విద్యార్థులు



మంచిర్యాలఅర్బన్: కేజీబీవీలో యోగా

ఘనంగా యోగా డే

జిల్లా వ్యాప్తంగా శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది, ఉపాధిహామీ కూలీలు ఆసనాలు వేసి యోగా సాధనతో కలిగే లాభాలు వివరించారు. యోగా ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగా చేయడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, లక్సెట్టిపేటలో జూనియర్ సివిల్ జడ్జి కాసమల సాయికిరణ్, చెన్నూర్‌లో మెజిస్ట్రేట్ పర్వతపు రవి, బెల్లంపల్లిలో ఏసీపీ ఏ.రవికుమార్, రామకృష్ణాపూర్‌లో డీఎఫ్‌వో శివ్ ఆశీష్ సింగ్, మందమర్రిలో ఏరియా జీఎం దేవేందర్, చెన్నూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి దుర్గం అశోక్, శ్రీరాంపూర్‌లో ఏరియా జీఎం శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



పాతమంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో..



మంచిర్యాలటౌన్: హైటెక్‌సిటీ పార్కులో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగా డే



చెన్నూర్: బీజేపీ ఆధ్వర్యంలో...



కాసిపేట: సర్టిఫికెట్లతో యోగా విద్యార్థులు



మంగెనపల్లిలో ఉపాధి కూలీల యోగా



బెల్లంపల్లి: యోగాసనాలు వేస్తున్న కార్మికులు



కిష్టంపేటలో యోగా చేస్తున్న ఉపాధిహామీ కూలీలు



పొన్నారంలో యోగా చేస్తున్న ఉపాధిహామీ కూలీలు



చెన్నూర్: యోగా చేస్తున్న మెజిస్ట్రేట్ రవి



లక్సెట్టిపేట: యోగా చేస్తున్న జడ్జి సాయికిరణ్



మంచిర్యాలటౌన్: వనితావాక్కు ఆధ్వర్యంలో...



రామకృష్ణాపూర్: గాంధారి వనంలో...



మందమర్రిరూరల్: జీఎం ఆఫీస్ ఆవరణలో...



యోగా వీక్షిస్తున్న అధికారులు, నాయకులు



రాజీవ్‌నగర్ మోడల్‌స్కూల్లో...



నస్పూర్: యోగాసనాలు వేస్తున్న జీఎం శ్రీనివాస్



నస్పూర్: ఆర్‌కే 6 గనిపై యోగాసనాలు వేస్తూ..



భీమిని పీహెచ్‌సీలో...



భీమారం: యోగా చేస్తున్న విద్యార్థులు

బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దు



సదస్సులో మాట్లాడుతున్న సివిల్‌జడ్జి సాయికిరణ్

దండేపల్లి: బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి కాసమల్ల సాయికిరణ్ అన్నారు. మండలంలోని కన్నెపల్లి మదర్ థెరిస్సా పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తేవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపించి, చదువులో తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. విద్యార్థులు చట్టాలు గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం పలువురు న్యాయవాదులు బాలల హక్కులు, చట్టాలను గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

బెల్లంపల్లి: జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం బెల్లంపల్లిలో ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపాలిటీలోని అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో వైద్య శిబిరం నిర్వహించి స్థానికులకు బీపీ, షుగర్, హెచ్ఐవీ, హెపటైటిస్ బీసీ, క్షయ పరీక్షలు నిర్వహించారు. జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్షయవ్యాధిపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏమాత్రం అనుమానం కలిగిన వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తెమడ పరీక్ష చేయించుకోవడం వల్ల క్షయవ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చని సూచించారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి క్షయవ్యాధి సోకే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. అన్నిరకాల పోషకాలు లభించే ఆహారం తీసుకోవడం వల్ల ఆ రోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ఈ శిబిరంలో వైద్యులు సుచరిత, రామకృష్ణ, ఎన్‌వీహెచ్‌సీపీ జిల్లా ఇంచార్జీ మధుబాబు, సీఎస్ఓ రాజేష్, టీబీ సూపర్‌వైజర్ శశికాంత్, సిబ్బంది వెంకటేశ్, జగన్మోహన్, శ్రీలత, రుబియా, కవిత, సంతోష్, గణేశ్, గంగయ్య, శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.

జయశంకర్ సార్‌కు నివాళి



దండేపల్లి: నివాళులు అర్పిస్తున్న నాయకులు

దండేపల్లి/రామకృష్ణాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని దండేపల్లిలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం ఆధ్వర్యంలో, రామకృష్ణాపూర్ పట్టణంలోని విఠల్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ కోసం అహర్నిశలు పరితపించిన వ్యక్తి జయశంకర్ అని జయశంకర్ సార్ కలలుగన్న సామాజిక తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో దండేపల్లిలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం నాయకులు వెంకటేశ్, శ్రీధర్, శ్రీకాంత్, శ్రీనివాస్, సత్యనారాయణ, కరుణాచారి, సురేష్, దేవయ్య, వెంకటేష్, తిరుపతి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రవిగౌడ్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్, రాజన్న, ఆర్కేపీలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, జాడి శ్రీనివాస్, రామిడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జయశంకర్ సార్ వర్ధంతి నిర్వహించారు. నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ ఇవ్వాలి



తహసీల్దార్లతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

మంచిర్యాలటౌన్: వచ్చే నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వోలు)కు శిక్షణ ఇవ్వాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. మంచిర్యాలలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బీఎల్‌వోలకు అందించే శిక్షణపై అవగాహన కల్పించి, శిక్షణను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం డీటీ గడియారం శ్రీహరి, రోహిత్ దేశ్‌పాండే, మంచిర్యాల తహసీల్దార్ రఫత్ హుస్సేన్, దండేపల్లి తహసీల్దార్ శ్రావణి, డీటీలు శ్రావణి, ఆతిశ్ కుమార్, హరిత, ప్రసాద్, వరలక్ష్మి పాల్గొన్నారు.

బస్సులు నడపండి.. బాధలు తీర్చండి

- పట్టణాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్న ప్రజలు
- 'మహాలక్ష్మి' పథకానికి దూరమవుతున్న జనం



లక్ష్మీపూర్ బస్టాప్ వద్ద వేచిచూస్తున్న ప్రయాణికులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి మీదుగా జనగామ వరకు బస్సు సర్వీసులను పూర్తిగా నిలిపివేయడంతో పార్‌పల్లి, లింగన్నపేట, ఎదులబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, అలుగామ, జనగామ, సుపాక, వెంచపల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం జోరుగా వ్యవసాయ పనుల నిమిత్తం చెన్నూర్, మంచిర్యాల లాంటి ప్రాంతాలకు రైతులు నిత్యం వ్యవసాయ పనులు ఎరువులు, బ్యాంకులోన్స్, వ్యవసాయ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం వంటి పనులకు వెళ్లాలంటే సుమారు రూ.300వరకు ఖర్చు చేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ప్రైవేట్ వాహనాల్లో ఆటోకు చెన్నూర్‌కు రూ.80కాగా చెన్నూర్ నుంచి మండలకేంద్రానికి రూ.50చెల్లించి వెళ్తున్నట్లు రైతులు తెలిపారు. ఇలాంటి సమయంలో రైతులకు, విద్యార్థులకు కూడా ఇబ్బంది అవుతుందని విద్యార్థులు చదువులకు దూరం అయ్యే పరిస్థితి కూడా లేకపోలేదని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. పార్‌పల్లి, కొల్లూర్ మీదుగా సిరోంచ కాళేశ్వరం బస్సులు ప్రయాణిస్తుంటాయి. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఆర్టీసీ డ్రైవర్ల అత్యుత్సాహంతో బస్సులు ఆపకుండా వెళ్తున్నారు. ఆర్డినరీ బస్సుకు ఎక్స్‌ప్రెస్ బోర్డు తగిలించి అదే పల్లె వెలుగు బస్సులో ఆర్టీసీ ఛార్జీలను వసూల్ చేస్తూ కొల్లూర్, రాంపూర్, దేవులవాడ, బబ్బరుచెల్క, లక్ష్మీపూర్ లాంటి ప్రాంతాల్లో బస్సులు ఆపకపోవడంతో నిత్యం చదువుల కోసం, అత్యవసరాలకు చెన్నూర్‌కు వచ్చే వారికి నిత్యం నరకయాతన పడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సు వస్తుంటే అడ్డుగా నిల్చొని విద్యార్థులు ఆపినా, ఆపకుండా వెళ్తున్నారే తప్పా కనికరించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మహాలక్ష్మి పథకం తీసుకొచ్చిన మండలవాసులకు ప్రయోజనం చేకూరడంలేదని, దీంతో ఆ పథకం ఎవరి కోసం తీసుకొచ్చారని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్‌పల్లి మీదుగా జనగామ వరకు బస్సు సర్వీసులను ప్రారంభించాలి. పార్‌పల్లి మీదుగా సిరోంచ, కాళేశ్వరం వెళ్లే బస్సులు ఆయా గ్రామాల వద్ద ఆపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

బస్సు నడిపించాలి...

మాది ఆలుగామ గ్రామం. నిత్యం పనుల కోసం చెన్నూర్‌కు వస్తుంటాం. అసలే వర్షాకాలం వ్యవసాయ పనుల కోసం కోటపల్లి మండలకేంద్రానికి వెళ్లాలన్న కూడా చెన్నూర్‌కు రావాల్సిందే. దీంతో బస్సు సర్వీసు నిలిపివేయడంతో ప్రైవేట్ వాహనాల్లో అధిక ఛార్జీలు చెల్లించి వస్తున్నాం. ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి బస్సు సర్వీసు ప్రారంభించాలి. - రాజు, ఆలుగామ

మా గ్రామాల వద్ద బస్సు ఆపేలా చూడాలి...

పార్‌పల్లి మీదుగా సిరోంచ కాళేశ్వరం నడిచే బస్సులకు కొల్లూర్, రాంపూర్, దేవులవాడ, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఆపేలా చూడాలి. ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు మా గోడును పట్టించుకోవాలి. - ఆసంపల్లి లక్ష్మి, లక్ష్మీపూర్

త్వరలోనే బస్సు సేవలు పునరుద్ధరిస్తాం...

పార్‌పల్లి మీదుగా బస్సు సర్వీసులను త్వరలోనే పునరుద్ధరిస్తాం. గతంలో షెడ్యూల్ లేకున్నా సర్వీసులు నడిపించాం. చెన్నూర్ నుంచి కాళేశ్వరం పార్‌పల్లి మీదుగా వెళ్లే బస్సులు ఎక్స్‌ప్రెస్ కావడంతో ఆపడంలేదు. బస్సులను స్టాప్‌ల వద్ద ఆపేలా చూస్తాం. - శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం, మంచిర్యాల

'బీజేపీ నాయకుల ఆరోపణల్లో వాస్తవం లేదు'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

తాండూర్: కిష్టంపేట గ్రామ పంచాయతీ ఇందిరమ్మ పథకం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని బీజేపీ నాయకులు చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్ జోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్‌లకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము నిరుపేదలమని గుర్తించి, తమకు గూడు కల్పించాలనే సదుద్దేశంతో ఇందిరమ్మ కమిటీ నాయకులు తమకు ఇళ్లు కేటాయిస్తే, వారు డబ్బులు తీసుకొని ఇళ్లు కేటాయించారని నిందలు వేయడం సరికాదన్నారు. నిజమైన లబ్ధిదారులకు మేలు జరుగుతుంటే అభినందించాల్సింది పోయి, ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిజనిజాలు బహిర్గతం చేయాలన్నారు. ఇప్పటికైనా ఇలాంటి ఆరోపణలు మానుకోవాలని అన్నారు.

మునీర్ సేవలు మరువలేనివి

మందమర్రిరూరల్: ఇటీవల అనారోగ్యంలో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్, సింగరేణి కార్మిక సంఘాల మాజీ చైర్మన్ ఎండీ మునీర్ సేవలు మరువలేనివని సీనియర్ జర్నలిస్టులు కొనియాడారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మునీర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సంజీవ్, సభ్యులు పాల్గొన్నారు.

కొమ్ముగూడెంలో బీజేపీ సమావేశం

లక్సెట్టిపేట: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో బీజేపీ శక్తి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై మండలాధ్యక్షుడు హేమంత్‌రెడ్డి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ పాలన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొక్కినపల్లి సతీష్, నాయకులు రాజేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.